
సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



ఉచిత హామీ..నెరవేరదేమీ

మహిళలకు ఉచిత బస్సు హామీ నెరవేరడం లేదు. ఉగాది పోయి చాన్నాళ్లయినా సర్కారు కళ్లు తెరవడం లేదు.
- 10లో



నో చెక్‌పోస్టు

టెక్కలి పరిధిలో గ్రానైట్ బ్లాకులు యథేచ్ఛగా తరలివెళ్లిపోతున్నాయి. అడిగే నాథుడే లేకుండా పోయాడు.
- 10లో

తాబేళ్ల సంరక్షణపై చిత్రలేఖన పోటీల విజేతలు వీరే

శ్రీకాకుళం: ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహించామని జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కంచిలి హైస్కూల్‌కు చెందిన సింహాద్రి హాసినికి ప్రథమ స్థానం, కోటబొమ్మాళి హైస్కూల్‌కు చెందిన ఎస్.నవ్యకు ద్వితీయస్థానం, రెంటికోట హైస్కూల్‌కు చెందిన ఆర్.స్నేహకు తృతీయస్థానం దక్కిందని డీఈఓ తెలిపారు.

న్యూస్‌రీల్

కనువిందు చేస్తున్న చెంగల్వ పూలు



ఆకర్షణీయంగా ఉన్న చెంగల్వ పూలు

ఎల్ఎన్ పేట: మండలంలోని మురగడలోవ గిరిజన గ్రామంలో ఈ ఏడాది ముందే పూతకు వచ్చిన చెంగల్వ పూలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. ఏటా మే నెలలో పూతకు వచ్చే చెంగల్వ పూలు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే విరబూశాయి. అరుదుగా కనిపించే చెంగల్వ పూల మొక్కకు చెందిన దుంపలు భూమిలో ఉంటాయి. దుంప నుంచి కాడలా పెరిగిన మొక్క ఒక్కో కాడ నుంచి అనేక పూలు పూస్తుందని గిరిజనులు సవర చిరంజీవి, సవర సింహాచలం తెలిపారు.

ప్రాచీన వారసత్వ సంపదను కాపాడుకుందాం



పురాతన బావి వద్ద ఇంటాక్ బృంద సభ్యులు

గార: ప్రాచీన వారసత్వ సంపదలను కాపాడుకుందామని ఇంటాక్ బృందం కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హెరిటేజ్ వాక్ పేరిట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో పర్యటించారు. షేర్ మహమ్మద్ ఖాన్ పాలనా కాలంలో అతిపెద్ద మెట్ల బావి నిర్మాణం చేశారన్నారు. గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 25 ఏళ్ల కిందటి వరకు ఈ బావి నీరు తాగడానికి వాడేవారమని గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో నిర్మించిన పురాతన భవనాలు కూడా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటాన్ని గుర్తించారు. ఈ భవనాలను, బావిని పర్యాటక కేంద్రంగా మలచడానికి అవకాశం ఉందని బృంద సభ్యులు అభిప్రాయపడ్డారు. పరిశీలనలో ఇంటాక్ మెంబర్లు కొమ్ము రమణమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ కుటుంబంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ రమణమ్మ కుటుంబంపై దాడి చేసిన వారిపై శుక్రవారం లావేరు పోలీసులు కేసు నమోదుచేశారు. డీలర్ రమణమ్మ రిమ్స్‌లో ఎంఎల్‌సీకు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోర పారోతి, పరపతి రాము, రమణమ్మ, గాలి రమణ, బోర అసిరినాయుడు, వాకాడ గణేష్, బోర గణేష్, దుర్గారావు, హరీష్‌లపై కేసు నమోదు చేశారు.

ఒకే సారి నాలుగు కొలువులు



గోకర్ల రాహుల్

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన గోకర్ల రాహుల్ నాలుగు కొలువులు సాధించి ఔరా అనిపించాడు. జనవరిలో ఆర్‌ఆర్‌బీ క్లర్క్‌గా, ఏప్రిల్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా పీఓగా, బ్యాంక్ ఆఫ్ బరోడా క్లర్క్‌గా, యూనియన్ బ్యాంక్ ఎల్‌పీఓగా కొలువులు సాధించాడు. తండ్రి బాలరాజు, తల్లి పద్మావతి. తండ్రి కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. విద్యార్థి ఇంటర్ విశాఖలోని నారాయణ కాలేజీలో, తర్వాత ఇంజినీరింగ్ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో చదివాడు.

'విలీనం ఆలోచన విరమించుకోవాలి'

శ్రీకాకుళం: హైస్కూల్‌లో ప్రాథమిక తరగతుల విలీనం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షులు బి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వ నిర్వాహకముందని ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్స్‌లో ప్రాథమిక తరగతులకు 10 మంది పిల్లలుంటే రెండు ఎస్జీటీలు, 11 నుంచి 30 మంది ఉంటే మూడు ఎస్జీటీలు, 45కి పైగా విద్యార్థులుంటే 4 ఎస్జీటీ, పాఠశాలలో 20 మంది ఉంటే ఒక టీచర్ అంటూ ఉపాధ్యాయుల సర్దుబాటులో వివక్షను కూడా తొలగిస్తూ అందరూ విద్యార్థులకు ఒకే రకమైన న్యాయం చేకూర్చాలని ఆ ప్రకటనలో కోరారు.





7రోడ్ల కూడలిలో ప్రదర్శన

ఉమెన్స్ కాలేజీ రోడ్డులోని క్రైస్తవారాధన చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



క్రీస్తు స్మరణలో..

శిలువనెక్కిన క్రీస్తును ఆరాధకులు స్మరించుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీధుల్లో ర్యాలీలు నిర్వహించి శాంతి సందేశాలు వినిపించారు. శ్రీకాకుళంలోని సహాయమాత చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

సంపాదనే ఆ ఎమ్మెల్యే సేవ!



నరసన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు స్వపక్షంలోనే విపక్షం తయారైంది. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నీ తానై వ్యవహరిస్తుండడం, సంపాదన మాత్రమే లక్ష్యంగా పనిచేస్తుండడంతో కొందరు ఆయన వైఖరిని అధిష్టానానికి చెప్పే ప్రయత్నంలో ఉన్నారు. వయసు రీత్యా మళ్లీ అవకాశం వస్తుందో రాదో అని భావించి దీపం ఉండగానే ఇళ్లు చక్క బెట్టుకోవాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారని నియోజకవర్గంలో చాలా మంది పెదవి విరుస్తున్నారు. దాని కోసం కుటుంబీకులను, బంధువులను రంగంలోకి దించారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే ఒకాయన బగ్గు వైఖరిపై యువనేతకు మెయిల్ పెట్టినట్టు సమాచారం.
– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

బగ్గు మంటున్నారు..

- నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గుపైనే చర్చ
- సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపణలు
- రంగంలోకి దిగిన కుటుంబీకులు, బంధువులు
- మద్యం, ఇసుక, రోడ్డు పనుల్లో ప్రమేయంపై స్వపక్షంలోనే విమర్శలు

మద్యం బిజినెస్‌లో..



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుటుంబీకులు ఏకంగా ఐదు మద్యం దుకాణాలను లాటరీలో దక్కించుకున్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోడలు భైరి మోహినికి 74 నంబర్ దుకాణం, మరదలు కుమారుడు ధర్మాన రామ్‌ప్రసాద్‌కు 71,72 నంబర్లు గల దుకాణాలు దక్కగా, వియ్యంకుడు గుండ ఏలేశ్వరరావుకు 77,78 నంబర్ల దుకాణాలు వచ్చాయి. నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి మండలాల్లో మద్యం సిండికేట్ నడుస్తోంది. ఈ రెండు మండలాల్లో ఉన్న 10 షాపులు అన్నింటినీ సిండికేట్‌లో కలిపేశారు. వైఎస్సార్ సీపీ అభిమానులకు చెందిన ఒక షాపును కూడా సిండికేట్‌కు ఒప్పించారు. ఇటీవల గీత కార్మికులకు పోలాకి మండలంలో కేటాయించిన షాపును కూడా సిండికేట్ లో చేర్పించారు. బెల్ట్‌షాపులైతే చెప్పనక్కర్లేదు. నరసన్నపేట, పోలాకి మండలాల్లోని గ్రామాల బెల్ట్‌షాపులకు నేరుగా మద్యం సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బెల్ట్ షాపులకు సరఫరా చేసే మద్యంపై ఒక్కో బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే మద్యం షాపుల్లో వాటాలు కొంత మంది కార్యకర్తలకు ఇచ్చారు. వారి సహకారంతో బెల్ట్ షాపులకు మద్యం చేరవేస్తున్నారు.

చెలరేగిపోతున్న పీఏ..



కుటుంబీకులే కాదు ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ గణపతి కూడా చెలరేగిపోతున్నారు. అవకాశం ఉన్న మేర దందా సాగిస్తున్నారు. చిరు వ్యాపారులనైతే వదలడం లేదు. చివరికి సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూడా ఆయన జులుం చూపిస్తున్నారు. ఇటీవల మహేష్ అనే నాయకుడిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటమే కాకుండా పాతేస్తాను...తంతాను అంటూ బెదిరింపులకు దిగారు. టీడీపీకి చెందిన వారే పీఏ తీరును తప్పుపడుతున్నారు. పెద్ద ఎత్తున ఆరోపణలు గుప్పిస్తున్నారు.

కుటుంబ సభ్యుల చేత మెటీరియల్ కాంపోనెంట్ పనులు

రూ.50 లక్షలు దాటిన ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెట్ కింద మంజూరైన రోడ్లు దాదాపుగా ఎమ్మెల్యే అనుయాయులు, వియ్యంకులు చేస్తున్నారు. వీటిలో ఆయన కుమారుల ప్రమేయం నేరుగా ఉందని తెలుస్తోంది. నియోజకవర్గంలో సుమారు రూ. 60 కోట్ల వరకు పనులు మంజూరయ్యాయి. నరసన్నపేట మండలం లకిమేర, ఉప్పరిపేట, రావులవలస, ఈదులవలసలతో పాటు పలు రోడ్ల నిర్మాణ పనులు నేరుగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పోలాకి మండలంలో ఎమ్మెల్యే వియ్యంకులు భైరి భాస్కరరావు అంతా తానై నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగుల బదిలీలు, చిరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం వంటివి ఈయనే చూస్తున్నారన్న వాదనలు ఉన్నాయి.

ఇసుకలోనూ జోక్యం



నియోజకవర్గంలో నరసన్నపేట, జలుమూరు మండలాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వీటిలో ఎమ్మెల్యే ప్రమేయం ఉందని టీడీపీలోనే చర్చ జరుగుతోంది. నరసన్నపేట మండలంలో గోపాలపెంటలో నెలలో 20 రోజుల పాటు ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కుమారుడి హస్తం కూడా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన అనుయాయులు ఆధ్వర్యంలో తవ్వకాలు చేసి అక్రమంగా తరలిస్తున్నారన్న వాదనలు ఉన్నాయి. నియోజకవర్గంలో మిగతా చోట్ల ఆయన కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. దీంట్లో ఎవరి వాటా ఎంతో వారికే తెలియాలి.

స్వపక్షంలోనే విపక్షం

టీడీపీలో నడుస్తున్న గ్రూపు రాజకీయాలు కారణంగా తనను వ్యతిరేకిస్తున్న స్వపక్షీయులు కొందరు నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలు, ఎమ్మెల్యే రమణమూర్తి వ్యవహారాలను అధిష్టానానికి చేరవేస్తున్నట్టు తెలిసింది. జరుగుతున్నదంతా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు. తాజాగా యాళ్ల మహేష్ అనే నాయకుడైతే ఏకంగా మంత్రి లోకేష్‌కు రమణమూర్తి, పీఏ తీరును వివరిస్తూ మెయిల్ పెట్టారు. వాట్సాప్‌లో కూడా సమాచారం ఇస్తున్నారు. పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కన పెట్టి అన్నీ వారే చేసుకుంటున్నారని ఫిర్యాదు కూడా చేశారు.

పిడుగుపాటుకు విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం



నారాయణపురంలో కేబుల్ నెట్‌వర్క్‌కు చెందిన పాడైన ట్రాన్స్‌మీటర్ పరికరాలు

కంచిలి: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పిడుగులతో కూడిన వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమయ్యాయి. మండలంలోని గోకర్ణపురం పంచాయతీ పరిధి గోకర్ణపురం, జె.నారాయణపురం గ్రామాల సమీపంలో పడిన పిడుగుల ధాటికి పలు ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి. జె.నారాయణపురం గ్రామానికి చెందిన ఓ కేబుల్ నెట్‌వర్క్ పరిధిలో ఆపరేటింగ్ సిస్టంలో ట్రాన్స్‌మీటర్, సెటాఫ్ బాక్సులు, ఎల్ఈటీ టీవీ తదితర పరికరాలు పాడయ్యాయని యజమాని రత్నాల డొంబురు తెలిపారు. గ్రామంలో రత్నాల గురునాథం, సీర దమయంతి, సీర పార్వతి, యారడి దీనబంధు, డి.హిమావతి తదితరుల ఇళ్లల్లో సెటాప్ బాక్సులతోపాటు విద్యుత్ ఉపకరణాలు పిడుగుపాటుకు కాలిపోయాయి. దీంతో వాళ్లంతా నష్టపోయారు. ఇలా పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది.

పిడుగు పాటుకు మూగజీవి మృత్యువాత



పిడుగు పాటుతో మృతి చెందిన ఆవు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గరుడబద్ర పంచాయతీ పరిధిలోని గల మర్రిపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృత్యువాత పడింది. అదే గ్రామానికి చెందిన పాడి రైతు బొల్ల సుజాతమ్మ ఆవులను మేత కోసం విడిచిపెట్టింది. ఈ సమయంలో వర్షంతో పాటు పిడుగు పడి సుమారు రూ.30 వేలు విలువ గల ఆవు మృతి చెందినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు బాధితరాలు తెలిపారు.



తీరంలో పండగ

- నేటి నుంచి రెండు రోజుల పాటు బారువలో బీచ్ ఫెస్టివల్
- ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణే కీలకం

సోంపేట:

జిల్లాలోని ప్రాచీన ఓడరేవుల్లో ఒకటిగా కీర్తినొందిన బారువలో నేటి నుంచి బీచ్ ఫెస్టివల్ ప్రారంభం కానుంది. ఈ రేవులో చిలక ఓడ సుమారు 108 ఏళ్ల కిందట మునిగిపోయింది. దీంతో ఈ ఓడరేవు కూడా కనుమరుగైంది. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో బారువ తీరంలో రిసార్టులు, లైట్ హౌస్ నిర్మాణం కావడంతో పర్యాటక అభివృద్ధికి పునాదులు పడ్డాయి. రిసార్టులు సిద్ధం కావడంతో చాలా మంది పర్యాటకులు దేశవిదేశాలనుంచి వచ్చి సేద తీరుతున్నారు. ఇక్కడి కోటిలింగేశ్వర స్వామి దేవాలయం, పాండవుల కాలంలో నిర్మితమైన బ్రహ్మ జనార్ధన స్వామి దేవాలయం, చారిత్రకంగా పేరుగాంచిన వేణుగోపాలస్వామి, జగన్నాథ స్వామి దేవాలయాలు కూడా ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇదివరకు 2016లో ఇక్కడ మహేంద్ర తనయ నది సముద్రంలో కలిసే ప్రాంతంలో పవిత్ర స్నానాలు నిర్వహించారు. దాదాపు పది లక్షల మంది వచ్చినట్లు భోగట్టా. కానీ తీరం అభివృద్ధి మాత్రం నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఈ బీచ్ ఫెస్టివల్ తర్వాతైనా అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నారు.

వసతులు కరువు

ఇంత చక్కటి తీరం అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం కనీస వసతులు లేకపోవడమే. మరుగు దొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ దీపాలు, రహదారులు, తీరంలో సేద తీరడానికి బల్లలు, దుస్తులు మార్చుకోవడానికి చిన్న గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



బారువ తీరానికి చేరుకున్న బోట్లు

రెండు రోజుల పండగ

19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. 19వ తేదీ ఉదయం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడతారు. ప్రజల్లో ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడం, అంతరించిపోతున్న ఆలివ్‌రిడ్లే తాబేళ్ల ప్రాముఖ్యతను తెలియజేయడం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా తీరంలో పరిసరాలు పరిశుభ్రం చేయడం, అనంతరం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. బీచ్ ఫెస్టివల్‌లో భాగంగా స్కూబా డ్రైవింగ్, మత్స్యకారులకు సంప్రదాయ పడవ పోటీలు, బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ తీరంలో ఏర్పాట్లు పరిశీలించారు.



బారువ తీరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

మన గణేశుడు సాధించాడు



రికార్డును సాధించిన అనంతరం జాతీయ పతాకంతో గణేష్



సముద్రంలో ఈదుతూ..

- డొంకలపర్త వాసి అరుదైన రికార్డు
- శ్రీలంక టు ఇండియా సముద్రంలో 28 కిలోమీటర్ల దూరాన్ని 10.30 గంటల్లో ఈదిన వైనం
- తెలుగు రాష్ట్రాల నుంచి పారా స్విమ్మర్‌గా చారిత్రాత్మక ఘనత

ఏలూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్ కోచ్‌గా పనిచేస్తున్న బూర్జ మండలం డొంకలపర్త గ్రామానికి చెందిన బలగ గణేష్ రాష్ట్రంలో తొలి పారా స్విమ్మర్‌గా చరిత్ర సృష్టించారు. శ్రీలంకలోని తలైమన్నార్ నుంచి భారతదేశంలో ధనుష్కోటి వరకు 28 కిలోమీటర్ల దూరాన్ని పది గంటల 30 నిమిషాల్లో ఈది తెలుగు రాష్ట్రాల నుంచి తొలి పారా స్విమ్మర్‌గా నిలిచారు. శుక్రవారం ఉదయం 5.50కు ప్రారంభించిన ఈ ప్రయాణాన్ని సాయంత్రం 4.20 గంటలకు పూర్తి చేశారు. ఈ అసాధారణ రికార్డుపై స్పోర్ట్స్ అథారిటీ అసోసియేషన్ ప్రతినిధులు, శాప్ ఎండీ గిరీశ పీఎస్, డొంకలపర్త గ్రామస్తులు అభినందనలు తెలిపారు.
– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

జలయజ్ఞ శోభ



మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞం కోసం శుక్రవారం జలయజ్ఞ శోభాయాత్ర ఘనంగా సాగింది. బాహుదా నుంచి నుంచి పవిత్ర జలాలను మహిళలు తీసుకువచ్చారు. జలయాత్రతో ఎమ్మెల్సీ నర్తు రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
– ఇచ్ఛాపురం టౌన్

క్లుప్తంగా

కామేశ్వరరావు నేత్రాలు సజీవం


నేత్రదాత కె.కామేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని బలగ సాయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న కె.కామేశ్వరరావు (92) అనారోగ్య కారణంగా మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో ఆయన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా, నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, నంది ఉమాశంకర్‌ల ద్వారా కామేశ్వరరావు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్ర దానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు కాల్‌చేయాలని కోరారు.

అనారోగ్యంతోనే రమణమూర్తి మృతి


రమణమూర్తి (ఫైల్)

నరసన్నపేట: వంశధార కార్యాలయం టెక్కలిలో అటెండర్‌గా పనిచేస్తున్న కొర్రాయి రమణమూర్తి (57) అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక మారుతీ నగర్ -1 లో ఒక ఇంటిలో అద్దెకు ఉంటుండగా ఇంటిలోనే ఆయన చనిపోయారు. గుండె పోటే మరణానికి కారణంగా భావిస్తున్నారు. అయితే ఆయన చనిపోయిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వారం రోజుల తర్వాత ఈ విషయం బయటపడింది. గురువారం సాయంత్రం ఇంటి లోపల నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు రమణమూర్తి కుటుంబ సభ్యులకు, తోటి ఉద్యోగులకు సమాచారం ఇచ్చిన విషయం విదితమే. శుక్రవారం ఉదయం పోలీసులు ఇంటి తలుపులు తెరిచి పరిశీలించగా కుర్చీలో ఒక వైపుకు వంగి అలా ఉండి పోయినట్లు గుర్తించారు. పక్కన వాంతి చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం నుంచి దుర్వాసన వస్తోంది. కుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రమణమూర్తికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె సౌజన్యకు వివాహం కాగా కుమారుడు అనిల్ విశాఖలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి మహిళకు గాయాలు


గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

మెళియాపుట్టి: ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి పక్కనే మట్టి వేయడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ మహిళ గాయపడ్డారు. మండలంలోని మారడికోట గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే మహిళ తన కుమారుడి ద్విచక్ర వాహనం పై జాడుపల్లి నుంచి తన గ్రామానికి వెళుతుండగా.. అచ్చనాపురం వద్ద ఉన్న మట్టి కుప్పల వద్ద బండి అదుపు తప్పి పడిపోయారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. 108 వాహనంపై క్షతగాత్రురాలిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆశల పల్లకిలో జీడి రైతులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో జీడి రైతులు ఆశల పల్లకిలో కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం జీడి పప్పు ధర మార్కెట్‌లో అనూహ్యంగా పెరిగి కిలో రూ.830కు చేరడంతో అదే రీతిలో జీడి పిక్కలు ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు. రైతు సంఘం నాయకులు కూడా అంచనాలు కడుతున్నారు. 80కిలోల పిక్కలకు కనీసం 23కిలోలు పప్పు దిగుబడి వస్తుందని జీడి కార్మికుల ద్వారా తెలుసుకొని జీడి పిక్కల ధర కూడా దానికి సమానంగా ఉండాలని, కనీసం 80కిలోల బస్తా రూ.16వేలు ఇవ్వాలని న్యాయమైన డిమాండ్‌ను అడుగుతున్నారు. ఇప్పుడిప్పుడే పలాస జీడి వ్యాపారులు గ్రామాల్లోకి వస్తున్నారు. పలాస పారిశ్రామిక వాడ జీడి ఉత్పత్తుదారుల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు చెప్పిన దాని ప్రకారం ప్రస్తుతం జీడి పిక్కల ధర రూ.12,400 ఉంది. ప్రస్తుతం జీడి పరిశ్రమల్లో పిక్కల కొరత ఉంది. దీంతో ఈ ఏడాది జీడి పిక్కలు ధరలు పెరుగుతాయని రైతులు ఆశిస్తున్నారు.


జీడి పిక్కలు ఏరుతున్న రైతు

ఉచిత హామీ.. నెరవేరదేమీ..?



- ఎన్నికల హామీని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఉగాది నుంచే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణమంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు
- బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించని వైనం

శ్రీకాకుళం అర్బన్: సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలయ్యే దాఖలాలు కనిపించడం లేదు. మహిళలు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చంటూ ఎన్నిలకు ముందు కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారాన్ని నమ్మిన మహిళలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 10 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయకుండా గాలికొదిలేసింది. ఈ 10 నెలల కాలంలో ఉచిత ప్రయాణం ఎప్పుడు అని కూటమి నేతలను నిలదీసిన ప్రతిసారీ ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకోవడమే తప్ప హామీని అమలు చేసిన పాపాన పోలేదు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలో అక్కడి ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పథకం అమలు చేస్తున్నాయి. కానీ మన వద్ద మాత్రం దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఉచిత ప్రయాణమంటూ చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు మహిళలను మభ్యపెట్టారని ఇప్పుడిప్పుడే స్పష్టం కావడంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉగాది నుంచేనంటూ..

ఉచిత బస్ ప్రయాణంపై మొదటిసారిగా ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. అటు తర్వాత దీపావళి కానుకగా ఉచిత ప్రయాణమంటూ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు, అచ్చెన్నాయుడు, రవాణాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలంతా ఉగాది పండగ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణమంటూ చెప్పడం ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు దీని ఊసెత్తలేదు. దీనికి తోడు సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదిక సాక్షిగా సూపర్‌సిక్స్ పథకాలు చూస్తుంటే భయమేస్తోందని చెప్పడంతో పాటు, ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సైతం ఉచిత బస్ ప్రయాణం కోసం నిధులు కేటాయించలేదు. దీంతో మహిళలంతా కూటమి నేతలపై గుర్రుగా ఉన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని మహిళలంతా కోరుతున్నారు.

భయమేస్తోందని చెప్పడం సిగ్గుచేటు



అధికారమే పరమావధిగా భావించిన కూటమి నేతలు అడ్డగోలు హామీలు గుప్పించారు. తీరా అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని చూస్తుంటే భయమేస్తోందని సాక్షాత్తు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం సిగ్గుచేటు. హామీలు ఇచ్చేటపుడు ఆచరణ సాధ్యమో? కాదో? గమనించలేరా. ఉచిత బస్ ప్రయాణం హామీ కేవలం మహిళలను మోసగించేందుకే.

– టి.కామేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

మహిళలను వంచించడమే



అధికారం కోసం ఉచిత బస్ ప్రయాణమంటూ కూటమి నేతలు మహిళలను వంచించారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఉచిత ప్రయాణంపై ఇప్పటికే ఎన్నోసార్లు కూటమి నేతలు ప్రకటిస్తున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడంలేదు. ఉచితబస్ ప్రయాణం హామీని నమ్మి ఓట్లు వేసిన మహిళలకు నమ్మక ద్రోహం చేయడం తగదు. ఇప్పటికైనా ఉచిత ప్రయాణంపై కూటమి నేతలు స్పష్టమైన ప్రకటన చేయాలి.

– పి.సౌజన్య, శ్రీకాకుళం

ఊదరగొట్టారు..



ఉగాది నుంచే ఉచిత ప్రయాణమంటూ కూటమి నేతలంతా ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు అవుతున్నా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్ ప్రయాణం హామీ ఇప్పటి వరకూ అమలు చేయకపోవడం దారుణం. ఉగాది పండగ అయిపోయినా సరే ఉచిత బస్ ప్రయాణంపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం శోచనీయం.

– గుంట జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

పార్టీ సేవలో ప్రభుత్వ ఉద్యోగి

పొందూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు బరి తెగిస్తున్నారు. అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి సంబంధించిన ఫ్లెక్సీల్లో పార్టీ నాయకులుగా పేర్లు ముద్రించుకుంటున్నారు. ఇదేమని అడిగితే మీకు నచ్చింది చేసుకోండంటూ సమాధానాలిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ ఉద్యోగి టీడీపీ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న వార్త అందరికీ తెలిసినా కొందరు ఉద్యోగులు ఏమాత్రం భయపడటం లేదు. ఇటీవల ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ తిరిగి వచ్చిన సందర్భంగా పలు కూడళ్లలో పెట్టిన ఫ్లెక్సీల్లో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు టీడీపీ నాయకుడిగా పేరును ముద్రించుకోవడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే..

లోలుగు గ్రామానికి చెందిన లోలుగు కామరాజు నందివాడ పంచాయతీ నరసాపురం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్న నిబంధనలను లోలుగు కామరాజు తుంగలోకి తొక్కారు. పొందూరు మండలంతో పాటు ఇతర మండలాల్లో జరుగుతున్న టీడీపీ కార్యక్రమాల్లో నేరుగా పాల్గొంటూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు. ఫ్లెక్సీల్లో టీడీపీ నాయకుడిగానే పేరును ముద్రించుకుంటున్నారు. మా నాయకుడికి అండగా ఉంటే ఎవరేమి చేస్తారంటూ బహిరంగంగానే మాట్లాడుతున్నారు. ఇటీవల ఆమదాలవలస మండలంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వాహనాన్ని కూన రవికుమార్ ప్రారంభించారు. సంబంధిత కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.


ఆమదాలవలసలో ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనుక ఉన్న లోలుగు కామరాజు

ఫ్లెక్సీతో నాకు సంబంధం లేదు

ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వదేశీ ఆగమన ఫ్లెక్సీల్లో నాపేరు, నా ఫొటో ఉండటం నాకు తెలియకుండా జరిగింది. నాకు సంబంధం లేదు.

– లోలుగు కామరాజు, ఎంటీఎస్ టీచర్, నర్సాపురం

విచారణ చేస్తాం

ఈ విషయం నా దృష్టికి రాలేదు. ఎవరూ ఫిర్యాదు చేయలేదు. దీనిపై విచారణ జరిపి వాస్తవాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

– గట్టు శ్రీరాములు, ఎఫ్‌ఏసీ ఎంఈవో, పొందూరు.


ఫ్లెక్సీలో ఉన్న ఉపాధ్యాయుడు లోలుగు కామరాజు

ఐసీడీఎస్‌లో కమీషన్ల గోల



టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలోని సమగ్ర శిశు అభివృద్ధి (ఐసీడీఎస్) టెక్కలి, కోటబొమ్మాళి ప్రాజెక్టుల పరిధిలో కమీషన్ల గోల తెర వెనుక వివాదాస్పదంగా మారుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ విషయంలో ఆయా కార్యకర్తల ఖాతాలకు ప్రభుత్వం అందజేసిన బడ్జెట్‌లో కొంత మేరకు తమకు ఇవ్వాలంటూ సిబ్బంది ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని బహిర్గతం చేస్తే ఆయా కేంద్రాలపై ఆకస్మిక దాడులు చేస్తామనే హెచ్చరికలు సైతం జారీ చేసినట్లు సమాచారం. కోటబొమ్మాళి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సుమారు 236 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల నిర్వాహణ అనగా కూరగాయలు ఇతర వంట సామగ్రి, వంట చెరుకు కొనుగోలు కోసం ఇటీవల ఒక్కో కార్యకర్త సొంత బ్యాంకు ఖాతాలకు సుమారు 3 నెలలకు సంబంధించిన బడ్జెట్‌ను జమ చేశారు. అయితే ఆయా బడ్జెట్‌లో తమకు ఎంత మేరకు ఇవ్వాలో లెక్క కట్టి మరీ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే ఇదే విషయం బహిర్గతం కావడంతో ఐసీడీఎస్ సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా మరో వైపు టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో టెక్కలి, నందిగాం మండలాల్లో సుమారు 228 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం వివిధ రకాల కార్యక్రమాల నిర్వహణ కోసం బడ్జెట్‌ను కార్యకర్తల ఖాతాలకు జమ చేశారు. ఇక్కడ సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. తమ కేంద్రాల నిర్వహణ కోసం కేటాయించిన బడ్జెట్‌లో సిబ్బందికి కమీషన్లు ఎందుకు ఇవ్వాలి అంటూ కొంత మంది అంగన్‌వాడీ కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది.

నో చెక్‌పోస్ట్..!

టెక్కలి: టెక్కలి గనులు భూగర్భ శాఖ పరిధిలో ప్రస్తుతం గ్రానైట్ క్వారీల నుంచి బ్లాకులు తరలివెళ్తున్నాయి. అయితే ఇందులో విశేషమేముంది అనుకుంటే పొరపాటే. గత నెల వరకు ఏఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడే ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఆయా సిబ్బంది తనిఖీ చేసిన తర్వాత మాత్రమే గ్రానైట్ బ్లాకులతో పాటు గ్రావెల్, స్టోన్ క్రషర్ మెటీరియల్‌ను తరలించేవారు. గత నెల 17 మునుపు ఏఎంఆర్ సంస్థకు కాంట్రాక్ట్ గడువు ముగిసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజుల వరకు ఎలాంటి పర్మిట్లు జారీ చేయలేదు. ఇప్పుడు తాజాగా ఓఎంఈపీఎస్ ద్వారా మైనింగ్ కార్యకలాపాలతో పాటు పర్మిట్ల జారీ, బ్లాకుల రవాణా పర్యవేక్షణ చేసే బాధ్యతలను ఆయా ప్రాంతాల మైనింగ్ అధికారులకు అప్పగించారు. దీంతో నిన్నటి వరకు ఉన్న ఏఎంఆర్ చెక్ పోస్టులు ప్రస్తుతం లేకపోవడంతో యథేచ్ఛగా గ్రానైట్ బ్లాకులు తరలిపోతున్నాయి. మరో వైపు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, వివిధ రకాల స్టోన్ క్రషర్ మెటీరియల్ తరలివెళ్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసే విషయంలో మైనింగ్ శాఖలో సిబ్బంది కొరత కనిపిస్తోంది.


టెక్కలి వలియాసాగరం వద్ద గతంలో చెక్‌పోస్ట్ ఉండే ప్రాంతం


టెక్కలి-పాతపట్నం రూట్‌లో బ్లాకులు తరలివెళ్తున్న దృశ్యం

భారీ మొత్తంలో బెల్లం ఊటలు ధ్వంసం


మర గ్రామంలో స్వాధీనం చేసుకున్న డ్రమ్ములు, ఇతర సామగ్రితో ఎక్సైజ్ పోలీసులు

మెళియాపుట్టి: శుక్రవారం మండలంలోని భరణికోట పంచాయతీ పరిధిలోని మర గ్రామంలో టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ ఆధ్వర్యంలో టెక్కలి ఎక్సైజ్ సిబ్బంది, మెళియాపుట్టి పోలీసుల సమన్వయంతో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీమొత్తంలో 1900 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 40లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నాటు సారా తయారీ క్రయ విక్రయాలకు అలవాటుపడిన వ్యక్తులను గుర్తించి పట్టుకుంటామని, తయారీకి కావాల్సిన ముడిసరుకు అందిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాటుసారా వల్ల కలిగే నష్టాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎస్ఈబీ సిబ్బందితో పాటు మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబు ఉన్నారు.

బాయిలింగ్ మిషన్ ఆపరేటర్ ఆత్మహత్య

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ లేబరు కాలనీలోని ఓ జీడి పరిశ్రమలో పనిచేస్తున్న జీడి బాయిలింగ్ మిషన్ ఆపరేటర్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కాశీబుగ్గ పోలీసులు నమోదు చేసిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 20వ వార్డు లేబరు కాలనీకి చెందిన కొవిరి కౌసల్య, రాజు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్ద కుమారుడు కొవిరి వేణు కాగా చిన్న కుమారుడు కొవిరి సాయికుమార్ (21). శుక్రవారం ఇంట్లో రెండు వైపులా తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానికుల సాయంతో అతడిని కిందకు దించి తక్షణమే పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించగా.. మరణించారని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అయితే బలవన్మరణానికి కారణం ఏమిటి అనే కోణంలో సీఐ సూర్యనారాయణ విచారణ చేపడుతున్నారు.


కొవిరి సాయికుమార్ మృతదేహం

పరిశ్రమల్లో భద్రతే ప్రామాణికం


యుబీ పరిశ్రమలో డీజిల్ ఫైర్‌ను ఫోమ్‌తో ఆపుతున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: పరిశ్రమల్లో పని కన్నా భద్రతకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పైడిభీమవరంలో గల అరో యాక్టివా ఫార్మా పరిశ్రమలో, బంటుపల్లిలో గల యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలోని అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోయాక్టివా పరిశ్రమలో బెంజీన్ ట్యాంక్ వద్ద బెంజీన్ లీకు అయితే ఏలా నివారించాలో పరిశ్రమ భద్రత అధికారులతో కలిసి మాక్ డ్రిల్ చేశారు. ఫోమ్‌ను ఉపయోగించి ఫైర్ కంట్రోల్ చేయడం చూపించారు. యూబీ పరిశ్రమలో డీజిల్ లీక్ లేక అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు.

వ్యాన్ బోల్తా

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై శుక్రవారం ఐచర్ వ్యాన్ బోల్తా పడింది. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కోల్‌కతా నుంచి బెంగళూర్ వైపు వేగంగా వెళ్తున్న వ్యాన్ ఒక్కసారిగా లచ్చన్న పేట గ్రామ సమీప జాతీయ రహదారిపై ఉన్న మలుపుని గుర్తించక అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలైయినట్లు స్థానికులు తెలిపారు. వ్యాన్ బోల్తాపడిన విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


అదుపు తప్పి బోల్తా పడిన వ్యాన్

● బోటు.. నీటితో ఎడబాటు

సముద్రంలో చేపల వేట నిషేధం అమలులోకి వచ్చేసింది. దీంతో బోటుకు నీటితో ఎడబాటు తప్పడం లేదు. బుడగుట్లపాలెం, డి.మత్స్యలేశం, బడివానిపేట, రాళ్లపేట, పాత దిబ్బలపాలెం రేవుల్లో ఒడ్డున బోట్లు ఉన్నాయి. మత్స్యకారులు పనిలేక, వలలు, ఇతర సామగ్రి మరమ్మతులు చేసుకుంటున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్



వలస కార్మికులతో మాట్లాడిన కేంద్ర మంత్రి

ఇచ్ఛాపురం రూరల్: శ్రీకాకుళం జిల్లా నుంచి ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన వలస కార్మికులు మోసపోయారంటూ శుక్రవారం 'సాక్షి' దిన పత్రికలో 'మస్కట్‌లో చిక్కుకున్న వలస కూలీలు' శీర్షికన వచ్చిన కథనానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఆయన శుక్రవారం వలస కార్మికులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన స్వదేశానికి సురక్షితంగా తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

తాగునీరు వృథా!



వేసవిలో గుక్కెడు నీటి కోసం గ్రామాలకు గ్రామాలు ఇబ్బంది పడుతుంటే.. ఇక్కడ మాత్రం వేల లీటర్ల తాగునీరు వృథా అవుతోంది. హిరమండలం మండలంలోని చొర్లంగి సమీపంలో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి సంబంధించి పైపులైన్ వాల్వ్ లీకైంది. దీంతో వాటర్ ఫౌంటైన్ మాదిరిగా నీరు ఎగసిపడుతోంది. గత రెండు రోజులుగా అదే పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం నిర్వహణ గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. – హిరమండలం

ఉపాధి పథకాన్ని రాజకీయం చేశారు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: గ్రామాల్లో నిరుపేద వ్యవసాయ కూలీలకు ఎంతగానో అండగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా రాజకీయం చేసేసిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. శుక్రవారం కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలకు ఉపాధి నిధులు దోచిపెట్టడానికి ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను అన్యాయంగా తొలగించేశారని గుర్తు చేశారు. అంతే కాకుండా నెలల తరబడి ఉపాధి వేతనాలు అందడం లేదని, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు పూర్తిగా ఉపాధి పనులు కల్పించడం లేదని ఆయన దుయ్యబట్టారు. ఉపాధి హామీ పనుల వద్ద కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదని, ఈ వేసవిలో మజ్జిగ పంపిణీ చేస్తామన్న హామీ ఏమైందని తిలక్ ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు చేతకాని తనంతో వ్యవసాయరంగం పూర్తిగా తలదించుకునే విధంగా చేసేశారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు విషయంలో పూర్తిగా వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. గతంలో 80 కిలోల సన్నరకం రూ.2300 ధర ఉండేదని ఇప్పుడు రూ.1700కు కొనుగోలు చేసే నాథుడు లేరని తిలక్ అన్నారు. వేరుశనగ కొనుగోలు విషయంలో గతంలో 40 కిలోల బస్తాకు రూ.3300 ధర ఉండేదని ఈ రోజు రూ.2400కు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో మినుములు బస్తా రూ.7 వేలు ధర ఉండేదని ఈ రోజు రూ.5500కైనా కొనుగోలు చేయలేకపోతున్నారని తిలక్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందన్నారు. కూటమి నాయకులంతా కలిసి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారు తప్ప ప్రజా సంక్షేమం కోసం కనీసం ఆలోచన చేయడం లేదని తిలక్ అన్నారు. ఆయనతో పాటు కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, కె.సంజీవ రావు, అన్నెపు రామారావు, ఎస్.హేమసుందర్‌రాజు, డి.రామకృష్ణారెడ్డి, ఎన్.సత్యరాజ్, పి.వెంకట్రావు, జి.సోమేశ్వర్రావు తదితరులు ఉన్నారు.


కోటబొమ్మాళిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్